క్లుప్తంగా

వేసవి విజ్ఞాన శిబిరంలో ఐక్యూ, క్విజ్ పోటీలు



క్రోసూరు: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు ఐక్యూ, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి వై.వీ రాంజమ్మ తెలిపారు. ఐక్యూ పోటీల్లో సంయుక్త, రూప ప్రథమ, ద్వితీయ బహుమతులు పొందారని చెప్పారు. క్విజ్ పోటీల్లో ఏ గ్రూప్‌లో ఎం.అంజనీ హేమలత, ఎం.నందిని, శ్రావణ్, కె.సువిష్ణ ప్రథమ,ద్వితీయ, తృతీయ, చతుర్థ స్థానాల్లో నిలిచారని తెలిపారు. బీగ్రూప్‌లో సంయుక్త, కె.సాయి, ఏ.వినయ్, కె.సిరి వరుసగా విజేతలుగా నిలిచారని పేర్కొన్నారు. విజేతలకు శిబిరాలు ముగింపు రోజున బహుమతులు అందజేస్తామని ఆమె చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నర్సయ్య మృతదేహం

రాజుపాలెం: అతి వేగంతో ముందున్న బైకును కారు ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని అద్దంకి–నార్కెట్‌పల్లి రహదారిపై పెదనెమలిపురి సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. పెదనెమలిపురి గ్రామానికి చెందిన కంకణంపాటి నర్సయ్య(50) కొండమోడు సమీపంలోని వీరమ్మ కాలనీకి వెళ్లి తిరిగి బైకుపై స్వగ్రామానికి వస్తున్నాడు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి ఒంగోలుకు అతి వేగంగా వెళుతున్న కారు వెనుక నుంచి బైకును ఢీకొనడంతో నర్సయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎస్ఐ వేణుగోపాల్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ

వేమూరు: రైతులకు యాభై శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి చందోలు సునీత అన్నారు. అమర్తలూరు మండలంలోని జంపని రైతు భరోసా కేంద్రంలో బుధవారం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె సాయిల్ హెల్త్ కార్డు ద్వారా ఎరువులు వాడడం వల్ల ఉపయోగాలను వివరించారు. రైతులంతా మట్టి నమూనా తీసి ల్యాబ్‌కి పంపి భూమిలో పోషకాలను తెలుసుకోవాలని ఆమె సూచించారు. వరి విత్తనాలు కావాల్సిన రైతులు గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రంలో తెలియజేయాలని ఆమె కోరారు. రెవెన్యూ శాఖ ద్వారా కౌలు రైతులంతా కార్డులు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారి మహాలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

అర్హులందరికీ కౌలు కార్డులందించాలి

ముప్పాళ్ల: అర్హులైన కౌలు రైతులందరికీ కార్డులు అందించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ సీహెచ్.లక్ష్మీప్రసాద్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సిబ్బందితో కౌలు కార్డులపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ మాట్లాడుతూ మండలానికి 2,071 కార్డులను కేటాయించారని, ప్రతి గ్రామంలో అర్హులైన కౌలు రైతులతో దరఖాస్తు చేయించి కార్డు అందించాలని తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ సమన్వయంతో పనిచేసి లక్ష్యాన్ని పూర్తి చేయాలని చెప్పారు. నీటి తీరువా మండలంలో రూ.1.29 కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. గ్రామాల వారీగా బకాయిల వివరాలపై సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సిబ్బంది వెంటనే స్పందించి నీటి తీరువా వసూలు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో ఆర్ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల వీఆర్వోలు, ఏఈఓలు పాల్గొన్నారు.

గుడిలో సీసీ కెమెరాల ధ్వంసంపై కేసు నమోదు

యడ్లపాడు: గ్రామదేవత గుడిలో సీసీ కెమెరాలు ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ టి.శివరామకృష్ణ తెలిపారు. మండలంలోని లింగారావుపాలెం గ్రామంలోని గంగమ్మ తల్లి గుడిలో ఇటీవల కొలుపులు నిర్వహించారు. కొందరు ఈనెల 2వ తేదీన గుడిలో దీపారాధన చేశారు. ఈ విషయంపై సదరు గుడికి చెందిన మరికొందరితో దీపారాధన చేసిన వారితో వాగ్వాదం జరిగింది. ఇదే తరహాలో గతంలోనూ ఒకమారు వాగ్వాదం నెలకొన్న నేపథ్యంలో పోలీసులు ఇరువర్గాల వారిని పిలిపించి సఖ్యత చేసి పంపించినా ఫలితం లేకపోవడం, ఆ తర్వాత గుడిలో సీసీకెమెరాలను ధ్వంసం చేయడం జరిగింది.

ఆలయ వార్షికోత్సవం

శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీగంగా పార్వతీ సమేత శ్రీసోమేశ్వర స్వామి దేవాలయం 8వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ప్రారంభమైనట్లు ఆలయ పూజారి సౌభాగ్యశర్మ తెలిపారు. ఈసందర్భంగా ఆలయ ధర్మకర్త ప్రముఖ వ్యాపారవేత్త సత్యసీడ్స్ అధినేత కొసనా రామకోటేశ్వరరావు–ధర్మపత్నీ కృష్ణవేణి దంపతులచే స్వామి వారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చెన్నంశెట్టి నాగేశ్వరరావు, కర్ణా శ్రీనివాసరావు, వడ్రాణం నాగేశ్వరరావు, మలిశెట్టి నరేష్, తేలంప్రోలు రవిబాబు, చెన్నా ప్రసాదు పాల్గొన్నారు.



పిడుగురాళ్ల అంబేడ్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి



పిడుగురాళ్ల మున్సిపల్ కార్యాలయంలో డీఈ శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు



గురజాల నుంచి పిడుగురాళ్లకు తరలివెళ్తున్న నాయకులు

హామీలకు బాబు వెన్నుపోటు

- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి
- 'వెన్నుపోటు దినం'కు భారీ స్పందన
- అడుగడుగునా కూటమి వ్యతిరేక నినాదాలు
- సూపర్‌సిక్స్ అమలు చేయాలని డిమాండ్

పిడుగురాళ్ల: ఏడాది కాలంలోనే ప్రజల నుంచి పూర్తిస్థాయిలో వ్యతిరేకత సాధించిన ఏకైక ప్రభుత్వం ఉందంటే అది కూటమి ప్రభుత్వమేనని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం బుధవారం నిర్వహించారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు నిర్వహించిన కార్యక్రమంతో పట్టణం పార్టీ జెండాలతో రెపరెపలాడింది. మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేసి సంవత్సర కాలం గడిచిన ఏం అభివృద్ధి జరిగిందని ప్రశ్నించారు. ప్రభుత్వ ఏర్పాటైన మొదటి మూడు నెలల్లోనే పిడుగురాళ్లలో ఐదుగురు బీసీలు, దాచేపల్లిలో ఇద్దరు, ఏడుగురు డయేరియా బారిన పడి చనిపోవడానికి ఈ చేతగాని దద్దమ్మ ప్రభుత్వం కారణమైందని దుయ్యబట్టారు. తాము పిడుగురాళ్లకి 75 సంవత్సరాల్లో మొట్టమొదటిసారి కృష్ణా జలాలు తీసుకొస్తే కూటమి ప్రభుత్వం కలుషిత నీటి నుంచి ఏడుగురిని పొట్టనపెట్టుకుందని విమర్శించారు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ఊరికి ఒక వార్డుకొక సచివాలయం పెడితే కూటమి నాయకులు మాత్రం వీధికొక పేకాట అడ్డాపెట్టి ఆడిస్తున్నారని ఆరోపించారు. గ్రానైట్ స్మగ్లింగ్, వైన్ షాపుల్లో పర్సంటేజీ, మైనింగ్ దోచుకోవటం వారు చేసిన అభివృద్ధి అని విమర్శించారు. రూ.500 కోట్లతో 90 శాతం ఆస్పత్రి, 70 శాతం మెడికల్ కాలేజ్ పూర్తి చేస్తే ఈ సంవత్సర కాలం అంగుళం కదల లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పిడుగురాళ్ల జానపాడు రైల్వే బ్రిడ్జి పనులు ప్రారంభించక పోతే కోర్టుకు వెళ్తామని చెప్పగానే మళ్లీ శంకుస్థాపన చేశారన్నారు. రూ.13,471 కోట్లతో గత ప్రభుత్వంలో అభివృద్ధి జరిగితే ఈ సంవత్సరంలో కనీసం ఒక్కరికైనా తల్లికి వందనం, అన్నదాతకు ఆసరా, ఫ్రీ బస్సు, మహిళలకు ఇస్తామన్న రూ.1500 వంటి హామీలు ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. ఒక ఉద్యోగమైన ఇచ్చారా, ఒక్కరికి అన్నం పెట్టారా అని ప్రశ్నిస్తూ కడుపు కొట్టడం గొప్ప కాదని వైఎస్ జగన్ మోహన్ రెడ్డి లాగా కడుపు నింపాలని హితవు పలికారు. మొదటి సంవత్సరంలో వారు చేసిన 154 వేల కోట్ల అప్పులు ఒక్కరోడ్డు వెయ్యకుండా ఒక బిల్డింగ్ కట్టకుండా ఒకరి సంక్షేమం ఇవ్వకుండా తెలుగుదేశం నాయకులు ఎలక్షన్లు ఖర్చుపెట్టిన వారి నాయకుల జేబుల్లోకి చంద్రబాబు నాయుడు ఫారెన్ అకౌంట్లోకి పోయాయని ఆరోపించారు. అనంతరం భారీ ర్యాలీతో పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్దకు వెళ్లి కార్యాలయంలో ఉన్న మున్సిపల్ డీఈ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు.



భారీ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

పిడుగురాళ్లకు తరలివెళ్లిన నాయకులు

గురజాల: వెన్నుపోటు దినంలో పాల్గొనేందుకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం తరలివెళ్లారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాల మేరకు చేపట్టిన వెన్నుపోటు దినోత్సవంలో భాగంగా నాయకులు పిడుగురాళ్లకు తరలివెళ్లారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ)మండల కన్వీనర్ కొమ్మినేని బుజ్జి , సిద్దాడపు గాంధీ, కె అన్నారావు ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు.

ప్రదర్శన ఇలా...

తొలుత వైఎస్సార్ సీపీ పార్టీ కార్యాలయం వద్దకు గురజాల నియోజకవర్గంలోని మాచవరం , పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల మున్సిపల్, మండలాల్లోని అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గంగమ్మ గుడి నుంచి కాసు మహేష్ రెడ్డి నేతృత్వంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భారీ సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ర్యాలీ పోలీస్ స్టేషన్ మీదగా మున్సిపల్ కార్యాలయం వద్దకు వెళ్లే దారి వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సెక్రటరీ, మున్సిపల్ వింగ్ ప్రెసిడెంట్ రేపాల శ్రీనివాసరావు, రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్ రెడ్డి, పార్టీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్, పట్టణ, మండల కన్వీనర్లు మాదాల కిరణ్ కుమార్, చింతా సుబ్బారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి చింత వెంకటరామారావు, మాజీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, కె.వి.ఆంధ్రయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ జిలా వుద్దీన్, బూత్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్ర కోటేశ్వరరావు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వీరభద్ర రామిరెడ్డి హాజరయ్యారు.

పేదలకు వైద్యసేవలందించాలి

జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు



వెల్దుర్తి: పల్నాడు జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు బుధవారం మండలంలోని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎంపీడీఓ కార్యాలయాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోగ్య కేంద్రానికి ఎంతో మంది పేషెంట్లు వస్తున్నారని, వారికి సరైన సేవలను అందించాలని వైద్యులకు సూచించారు. పీహెచ్‌సీలోని ల్యాబ్‌లో అన్నీ పరీక్షలు నిర్వహిస్తున్నారా? సిబ్బంది సకాలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వస్తున్నారా లేదా అని ఆరా తీశారు. రిజిస్ట్రారు తనిఖీ చేశారు. ఎంప్లాయిస్ హెల్త్ రికార్డ్స్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారా అని వైద్యులు శ్రీరామ్, లక్ష్మీప్రసన్నలను అడిగి తెలుసుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌పై ఆరా తీశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు జిల్లా కలెక్టర్‌కు ప్రధాన మంత్రి కిసాన్ యోజన డబ్బులు రాలేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి బీవీ రవి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి డి.ప్రసాద్, పీఆర్ ఏఈ పాశం శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ బాషా పాల్గొన్నారు.

మండలంలో ప్రధానోపాధ్యాయుల బదిలీలు

నూజెండ్ల: విద్యాశాఖలో బదిలీలు పూర్తయ్యాయని మండల విద్యాశాఖాధికారి రవిచంద్ర మంగళవారం తెలిపారు. మండల పరిధిలోని నాలుగు జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలల్లో నూతనంగా ప్రధానోపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారన్నారు. నూజెండ్ల జెడ్పీలో బి.శ్రీదేవి, కంభంపాడుకు యం.వెంకటనాగ బసవయ్య, ములకలూరు టి.శ్రీలక్ష్మి, పాత నాగిరెడ్డిపల్లె పాఠశాలకు వి.జానకి బదిలీపై రావటం జరిగిందని తెలిపారు. మండలం నుంచి ప్రాథమిక పాఠశాలల్లో ఉప్పలపాడు నుంచి రవి, ఐనవోలు పద్మజ, బుర్రిపాలెం పాఠశాల నుంచి కోటేశ్వరావు, రవ్వరం కృష్ణారావు, చెరువుకొంపాలెం పాఠశాల నుండి విజయలక్ష్మిలు బదిలీపై వెళ్లారని యంఈవో అన్నారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

మాచర్ల రూరల్: మండలంలోని కంభంపాడు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌స్టిట్యూట్ ప్లాంటేషన్ సిట్టింగ్ ఫీల్డ్ విజిట్‌లో భాగంగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ సిద్ధ లింగమూర్తి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5న ప్రపంచ సరోవర్‌ల వద్ద విస్తృతంగా మొక్కలు నాటాలని, హార్టికల్చర్ పెంపకంలో భాగంగా రైతులకు పండ్ల టోలకు తమ పథకం ద్వారా లబ్ధి చేకూరుస్తామని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు సంబంధిత మండల పరిషత్ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథక కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీ కొరటా మల్లికార్జునరావు, ఏపీఓ నాగ శ్రీనివాస్, టీఏ కిశోర్, నాగమల్లేశ్వరరావు, గోవిందరాజు, రాఘవ పాల్గొన్నారు.



మొక్కలు నాటేందుకు గుంతలు తీస్తున్న దృశ్యం

మా పొట్టగొడుతున్న ప్రభుత్వం

షిఫ్ట్ ఆపరేటర్ల ఆవేదన

నకరికల్లు: ఐదేళ్లుగా పనిచేస్తున్న తమను నిర్లక్ష్యంగా విధుల నుంచి తొలగించి కూటమి ప్రభుత్వం తమ పొట్ట గొడుతోందని షిఫ్ట్ ఆపరేటర్లు వాపోతున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో నియమించబడ్డామన్న ఒకే ఒక్క కారణంలో తమను తొలగించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం వారి గోడును వెలిబుచ్చారు. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం పరిధిలో ఐదు విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయి. వాటిలో 20 మంది షిఫ్ట్ ఆపరేటర్లు ప్రస్తుతం పని చేస్తున్నారు. కాగా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చే నాటికి ఖాళీగా ఉన్న 11 పోస్టులను దఫాల వారీగా భర్తీ చేశారు. కొత్తగా ఉద్యోగం పొందిన షిఫ్ట్ ఆపరేటర్లు అప్పటి నుంచి పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సబ్‌స్టేషన్‌లలో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లను తొలగించి వారి స్థానంలో తమ వారిని చేర్చుకోవాలన్న ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దానిలో భాగంగా 2020లో విధుల్లో చేరి చేజర్ల గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న బాణావతు రవినాయక్, పట్టంశెట్టి సుబ్బారావు, కండ్లకుంటలో పనిచేస్తున్న దండే ఆదినారాయణ, షేక్ అబ్దుల్‌బాషాలను ఇటీవల తొలగించారు. మిగిలిన ఏడుగురిని కూడా తొలగించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ మేరకు బాధితులు మాట్లాడుతూ తమను అన్యాయంగా తొలగించారని, కలెక్టర్ వద్దకు వెళ్లి గోడు వెలిబుచ్చామని తెలిపారు. అయినా విద్యుత్ శాఖ అధికారులు ఏ మాత్రం కనికరించడం లేదని వాపోయారు. ఉద్యోగాలు తొలగించడం వల్ల పేదలమైన తమ జీవితాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ పేరుతో తమ పొట్ట కొడుతున్నారని వాపోయారు. తమను వెంటనే విధుల్లోకి తీసుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యమని కన్నీరుమున్నీరవుతున్నారు. కొసమెరుపు ఏమిటంటే ఏ సబ్‌స్టేషన్ నుంచి ఎవరిని తొలగిస్తున్నారు... కొత్తగా తీసుకుంటున్న వ్యక్తికి ఎవరు సిఫారసు చేస్తున్నారన్న జాబితాను కూడా అధికారులే సిద్ధం చేసి అంతర్గతంగా విడుదల చేయడం విస్మయంతో పాటు చిరుద్యోగులపై ప్రభుత్వ నిబద్ధతకు అద్దం పడుతుంది.



షిఫ్ట్ ఆపరేటర్లు బాణావత్ రవినాయక్, పట్టంశెట్టి సుబ్బారావు

6 నుంచి ఉపాధి పనుల క్షేత్రస్థాయి తనిఖీలు

యడ్లపాడు: ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన పనులపై ఈనెల 6వ తేదీ నుంచి క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీలకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకోసం ఎంపీడీవో కార్యాలయంలో గ్రామస్థాయి సామాజిక తనిఖీ బృందానికి శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. స్టేట్ రిసోర్స్ పర్సన్ బి.అవులయ్య వివరిస్తూ మండలంలోని పంట కాలువలు, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, పండ్ల తోటలు, సీసీ రోడ్లు, సచివాలయ భవనాలు, గోకుల షెడ్‌లు, పేదల కోసం నిర్మించిన ఇళ్ల వంటి మొత్తం 1122 ఉపాధి పనులను పరిశీలించనున్నట్లు తెలిపారు. ఇందుకోసం 8 మంది డీఆర్పీలు, 20 మంది వీఎస్ఏలు క్షేత్రస్థాయి పరిశీలన చేయనున్నారు. ఈ మేరకు వీఎస్ఏ సభ్యులకు ఈనెల 1 నుంచి శిక్షణ ఇవ్వబడుతోందని తెలిపారు.



విలేజ్ సోషల్ ఆడిటర్స్‌కు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను నివారించవచ్చు

యడ్లపాడు: క్యాన్సర్ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు తిమ్మాపురంలోని ఎస్సీ కాలనీలో నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. యడ్లపాడు ప్రాథమిక ఆరోగ్యకార్యకర్తలు, ఆశాలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, రాకకు గల కారణాలు, నివారణ మార్గాలు, వైద్య పరీక్షల ప్రాముఖ్యతపై వివరించారు. ప్రపంచ వ్యాప్తంగా రెండవ ప్రధాన మరణ కారణంగా నిలు స్తోందన్నారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు నరేంద్ర సువర్ణకుమారి, ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు వై ప్రసాద్‌రావు, డీఈఓ ఎం సాంప్రనీత్, ఏఎన్ ఎం నాగమణి, ఆశ కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇది దొంగల ప్రభుత్వం..

- వంచనకు బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు
- వైఎస్సార్ సీపీ నేత గౌతంరెడ్డి

మాచర్ల: రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా వైఎస్సార్ సీపీ అధిష్టాన నేత, మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు వెన్నుపోటు దినం నిర్వహించారు. పోలీసు ఆంక్షల మధ్య కార్యాలయం బయట, కార్యాలయ ప్రాంగణంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట పార్లమెంట్ పరిశీలకుడు పూనూరి గౌతంరెడ్డి, పిన్నెల్లి రమాదేవి, పిన్నెల్లి స్వాతి, జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు కొమ్ము చంద్రశేఖర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మాచర్ల సుందరరావు, మున్సిపల్ మాజీ చైర్మన్లు కామనబోయిన కోటయ్య, అబ్దుల్ జలీల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పూనూరి గౌతంరెడ్డి మాట్లాడుతూ ఇది ప్రజల ప్రభుత్వం కాదు, రాక్షస ప్రభుత్వమని ధ్వజమెత్తారు. పల్నాడు జిల్లాలో వైఎస్సార్ సీపీ క్యాడర్‌పై నిఘా పెట్టి కేసుల మీద కేసులు నమోదు చేస్తూ కార్యకర్తలు వెన్నుపోటు దినం కార్యక్రమానికి రాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. వెన్నుపోట్లకు బ్రాండ్ అంబాసిడర్ ఎవరిని గూగుల్‌లో సెర్చ్ చేసినా చంద్రబాబు కనబడతారని ఎద్దేవా చేశారు. ఆయన చదువుకునే అప్పటి నుంచి వెన్నుపోటు అలవాటుగా మారిందని చెప్పారు. మంత్రి పదవి కోసం వెన్నుపోటు పొడిచారని, ఆ తరువాత సొంత మామనే వెన్నుపోటు పొడిచి ముఖ్యమంత్రి పదవి లాక్కున్నారని, చివరికి కోట్ల మంది ప్రజలను మోసగించారని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బడుగు, బలహీన వర్గాలకు ఏడాదిగా ఇవ్వకుండా మోసగించటమే లక్ష్యంగా పనిచేస్తున్నారని వివరించారు. దోపిడీ ప్రభుత్వంగా ఇసుక, మద్యంతో పాటు అన్నిట్లో అక్రమాలకు మారుపేరుగా డబ్బులు తీసుకోవటమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. పేద వాడి సంక్షేమం మరచిపోయారని సూపర్ సిక్స్ లేదు, డూపర్ సిక్స్ లేదని ఆయన ఎద్దేవా చేశారు.

మాచర్లలో పోలీసుల ఆరాచకం..

మాచర్లలో పోలీసులు నిరసన కార్యక్రమాన్ని అడ్డగించి శాంతిభద్రతల పేరుతో తామెల్లకుండా చేయటం ఎంత వరకు సమంజసమని గౌతంరెడ్డి ప్రశ్నించారు. మరోవైపు తెలుగుదేశం పార్టీ, తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరితే ఎందుకని పోలీసులు పట్టించుకోవటం లేదన్నారు. ఇదే శాంతిభద్రతల పరిరక్షణ అని ప్రశ్నించారు.

పిన్నెల్లిపై కేసు అన్యాయం..

పిన్నెల్లి రమాదేవి మాట్లాడుతూ ఏడాదిగా అడ్డగోలుగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. నాలుగు సార్లు గెలిచిన నా భర్త, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై కొత్తగా హత్య కేసు పెట్టిందని చెప్పారు. మా ఇంటికి, పార్టీ కార్యాలయంకి ఎవరైన వస్తే వారిపై కేసులు పెడుతున్నారని తెలిపారు. పోలీసులు వైఎస్సార్‌సీపీ శ్రేణులను ఇబ్బందులకు గురిచేయటమే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. అందుకు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి కారణమని చెప్పారు. ఇటువంటి చర్యలు ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. కార్యక్రమంలో పిన్నెల్లి స్వాతి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ సంయుక్త కార్యదర్శి నవులూరి చెన్నారెడ్డి, ఎంపీపీ పోతురెడ్డి కోటిరెడ్డి, మాజీ ఎంపీపీ సంపూర్ణమ్మ, పార్టీ దుర్గి అధ్యక్షుడు ఉన్నం పెద్దబ్బాయ్, మాచర్ల పార్టీ అధ్యక్షులు పోలా శ్రీను, మైనార్టీ జిల్లా నాయకులు నాగూర్, ట్రాక్టర్ కరిముల్లా, మస్తాన్, మద్దికర శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు మందా సంతోష్, న్యాయవాది మాధవి, కడియం యోబులు, సర్పంచులు గొట్టం బ్రహ్మారెడ్డి, ఓరుంటి చిన్నాతో పాటు మహిళలు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బైక్ దగ్ధం

నూజెండ్ల: ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం దగ్ధమైన సంఘటన మండలంలోని చింతలచెర్వు గ్రామ సమీపాన పోలేరమ్మ దేవాలయం పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని కొండ్రాయునిపాలెం గ్రామానికి చెందిన కోనంగి సుబ్బారావు తన భార్య ఇరువురు కలిసి హీరోహోండా ద్విచక్ర వాహనంపై దర్శిలో శుభాకార్యం చూసుకొని తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. ఈక్రమంలో మార్గమధ్యంలో బైకు ప్లగ్ బిట్ నుంచి పొగరావటాన్ని గమనించాడు. రోడ్డు పక్కనే బైకును నిలుపుదల చేసి దూరంగా వెళ్లారు. దీంతో బైకు నుంచి మంటలు పెద్ద ఎత్తున వచ్చాయి. సమీపంలో మంటలను అదుపులోకి తీసుకొని రావటానికి ఎటువంటి నీటి సౌకర్యం లేకపోవటంతో నివ్వెరపోయారు. వేసవి తీవ్రత అధికంగా ఉండటంతో ఈసంఘటన జరిగి ఉంటుందని భావిస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డు కోటబజారు పులుపులవారి వీధిలో వేంచేసియున్న శ్రీవీరాంజనేయ సహిత శ్రీయోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ రాతి నిర్మాణానికి వైభవ్ జ్యువెలరీస్ అధినేత పెనుగొండ వెంకటేశ్వరరావు జ్ఞాపకార్థం భార్య రత్న కుమారి, కుమారులు ప్రభాకర్, ప్రతాప్‌లు రూ.3 లక్షలు విరాళంగా అందించారు. ఈమేరకు ఆలయం వద్ద ఆలయ కమిటీ ప్రతినిధులు వనమా కృష్ణ, కోవూరి శివశ్రీనుబాబు, గజవల్లి మురళీలకు విరాళం మొత్తాన్ని అందించారు. శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల పాలకవర్గం ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు సుదీర్ఘ కాలం భాద్యతలు నిర్వహించారు. అలాగే పట్టణానికి చెందిన కాకరపర్తి అంకుప్రసాదు దంపతులు రూ.25,116లు, దుద్దు వెంకటరావు దంపతులు రూ.25,116లు విరాళంగా అందించినట్టు కమిటీ ప్రతినిధులు తెలిపారు.



నేడు వేద గాయత్రీ మాత ఆవిర్భావ దినోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని ఎస్బీఐ రోడ్డులో గల ఫిరోజీ ఋషీంద్రుల మఠంలో శ్రీ పంచముఖీ వేద గాయత్రీ అమ్మవారి ఆలయంలో గురువారం వేద గాయత్రీ మాత ఆవిర్భావ దినోత్సవం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు బుధవారం తెలిపారు. గురువారం ఉదయం 6 గంటలకు అచ్చంపేట రోడ్డులోని శివాలయం నుంచి అమ్మవారికి పసుపుకుంకుమ, పూల కావిడులు, శ్రీ లక్ష్మీనరసింహస్వామికి పానకం కావిడులతో ఊరేగింపు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు గాయత్రీ మాతకు అన్నాభిషేకం, 10 గంటలకు గాయత్రీ హోమం జరుగుతుందని తెలిపారు.

విద్యామిత్ర స్టాక్ పాయింట్ పరిశీలన

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లోని శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర స్టాక్ పాయింట్‌లను రాష్ట్ర బృందం నోడల్ ఆఫీసర్ ఎస్. గీత బుధవారం తనిఖీ చేశారు. వేసవి సెలవుల అనంతరం ప్రారంభం కానున్న నూతన విద్యా సంవత్సరానికి గాను విద్యార్థులకు అందజేయాల్సిన యూనిఫాం, బ్యాగ్‌లు, టెక్స్ట్‌బుక్స్, నోట్ పుస్తకాల నిల్వ వివరాలను తనిఖీ చేశారు. పాఠశాలల పునః ప్రారంభానికి ముందే విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ అంతటినీ చేరవేయాలని ఆమె సూచించారు. శుక్రవారం నుండే డిమాండ్ మేరకు అన్ని పాఠశాలలకు మెటీరియల్ చేరవేసేందుకు సిద్ధమవుతున్నామని మండల రిసోర్స్ పర్సన్ మస్తాన్‌రావు నోడల్ ఆఫీసర్‌కు తెలియజేశారు. స్టాక్ పాయింట్‌లో ఉన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర సంబంధించిన రికార్డులను ఎస్. గీత తనిఖీ చేశారు. తనిఖీ బృందంలో జిల్లా పరిశీలకురు పి.వనజ, పల్నాడు జిల్లా సీఎంవో పి.పద్మారావు తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న స్టేట్ నోడల్ ఆఫీసర్ ఎస్. గీత